# తెల్లవారింది

చీకటి తెల్లచీరని చుట్టుకున్నట్లు పరిసరాలు మంచుముసుగులో నిల్చాయి. మల్లి కాంబకి నాలుగు రోజులుగా కంటిమీదకి కునుకు రాలేదు. మళ్ళీ తెల్లవారుతోంది. తెమలని ఆలోచనలతో మొద్దుబారిన మెదడుకి నిర్ణయించుకునే శక్తిలేక చిరాకుతో మనస్సు మూలుగుతోంది. ఆ యింటి యజమాని పసుపుబట్టల కొంగుపట్టుకు ఆరనిపారాణి పాదం పెట్టి రెండేళ్లు తిరిగాయి. ఆ ఆవరణలో ఎవరికీ ఆకలిబాధ తెలీదు. నడి వయస్సుదాటిన భూపాలరావుగారి పల్చటిదుస్తుల వెనక అలసట అప్పుడుప్పుడు తొంగిచూస్తుంది. రెండేళ్ళక్రితం జరిగింది కళ్ళల్లో కనబడుతోంది:

మల్లి కాంబకి వయస్సు లేకపోయినా ఆకారం నిండుఐందే. పచ్చటి శరీరం, బొద్దుగా, ఎత్తుగా, విశాలమైనకళ్ళతో దీనంగా దడి వెనకనుంచి మాట్లాడ్డం, భూపాలరావు మొదటి సారి బంధువుల ఇంటివెనుక చూశాడు.

అనుభవంగల పిల్లతల్లి భూపాలరావు చూపులో గ్రహించిన భావం పినతల్లి దగ్గర కదిపింది.

తన స్థితిని మర్చిపోయిన తల్లి మొదట ఈసడించినా తెప్పరిల్లి వొప్పుకుంది.

భూపాలరావు పైకి వద్దన్నా పెళ్ళిచేసుకుంటే తప్పేమిటిలే అని సమాధానపడ్డాడు. పెద్దకొడుకు ఎదురు తిరిగి ఇంటికి రానని ఆగడం చేశాడు.

కాలం ఏడాది తిరిగేసరికి మనస్సు మార్చుకుని పెద్ద కొడుకు ఇంటికి వచ్చాడు.

తల్లికి చాలా సుస్తీగా వుందని మల్లి కాంబకి తమ్ముడు దీనంగా వుత్తరం వ్రాశాడు. ఆ

వుత్తరం చదువుకుంటూ ఎంతసేపు ఏడ్చిందో భూపాలరావుగారి కేకకి తేరుకున్నాక తెలుసుకుంది.

మళ్ళీ పెద్దకంఠంతో మాటలు మొదలుపెట్టాడు. "ఆ డబ్బు ఏంచేశావు? నీకు ఆ డబ్బుతో ఏం అవసరం వచ్చింది? పెద్దాడు నువ్వు తియ్యటం చూశానంటున్నాడు. తీసుకురా తొందరగా" అంటూ గద్దించే భూపాలరావుని మల్లి కాంబ అర్థంకానట్లు చూడ్డం మిగిలిన పిల్లలు అదను దొరికినందుకు సంతోషంగా "చూడునాన్న, నంగనానాచిలా ఎల్లాచూస్తోందో. అన్నయ్యమీద పెడదామని చేసివుంటుంది" అంటూ చిన్న కూతురు సుభద్ర మాట అందించింది.

భూపాలం ఆవేశం, కోపం తగ్గేసరికి మల్లి కాంబ వళ్ళు హూనమైంది. ఆ రాత్రి పంచాలో కెక్కుతూ చీకటి వళ్ళో కళ్లు మూసింది. మల్లికాంబ మనసులో తల్లిరూపం కదిలింది. దీనంగా తల్లి కళ్లు తనకేసి చూస్తున్నాయి. తలుచుకు దుఃఖపడటం తప్ప తనేం చెయ్యలేదు. ఆ ఇంట్లో వంటవాడు తినమని పిలవటం తప్ప ఇంట్లో అందరు వున్నా వక్కళ్లూ రాక పోవటం తల్చుకుని అభిమానంతో తిండి తినకుండా గడుపుతోంది.

కనుచీకటి వెలుతురులో భూపాలరావు మల్లి కాంబని వెతుక్కుంటూ పంచాలో అడుగుపెట్టాడు. చలనంలేని వస్తువులా నేలపైబడి వుండటం చూసి మనస్సులో బాధ తిరిగింది.

మల్లి కాంబని వోదార్చటం తెలవక దూరంగా కూర్చున్నాడు. దగ్గిరి కెళ్ళాడు. మాటలురాక "మల్లీ మీ అమ్మ" అని వూరుకున్నాడు. తిండిలేని నీరసంపోయి దుఃఖంలో కొత్త శక్తి వచ్చింది. ఆవురుమని దిక్కులతో కలిపి ఏడ్చింది. "బండి కట్టించా వెడతావా?" అన్న భూపాలరావు గొంతులో తండ్రి గొంతు వినపడి ఆవేశందిగజారి పసిపిల్లలా తలవూపి ప్రయాణమైంది. బండి పొలిమేర చేరేసరికి పొద్దు తాడిచెట్ల వెనక్కి దిగుతోంది. చీకటి దూరంగా చెట్ల మొదళ్ళలో కూర్చున్నట్లు వూరు దిగులుగా కనబడింది.

తన చిన్నతనంలో తండ్రీ, తనూ ఆ వేళప్పుడే ఆవూరికి రావటం గుర్తుకొచ్చింది. నాన్నగారు వొచ్చారంటూ రావిచెట్టు దగ్గరే ఎదురైన కుర్రాళ్ళు, పెద్దాళ్ళూ పడ్డ సంతోషం అద్దాలదీపాలతో ఇంటిదాకా వచ్చిన మొహాలు ఒక్కొక్కటే కళ్ళముందు కదులుతున్నాయి.

"అమ్మా! బండి ఎటు తిప్పనండి" అన్న బండివాడి మాటలతో వులిక్కిపడి 'వంతెనవతలకి అని పొడిగా చెప్పింది. ఇంటిముందు బండి ఆగిన చప్పుడికి పెద్దక్క ఎండిపోయిన గొంతులో ఏడుపు వినపడింది మల్లి కాంబకి. ఇంట్లోకి వెళ్ళ బుద్ధిపుట్టక మెట్లపైకూలబడి దుఃఖాన్ని ఆపుకుంటోంది. ఇరుగూ పొరుగూ వోదార్చారు. నువ్వాదుకున్నా బతికేదే మోనని కొందరు పెదిమ విరచటం. ఆ అదంతా వట్టి భ్రాంతి. ఆ క్షణం తప్పించేందుకు ఎవరితరం అంటూ మరో తరహా వొదార్పులు. అన్నీ జరిగినట్లే రోజులు దొర్లాయి. కష్టసుఖాలు గొప్పింట్లో జరిగితే వోతరహాగా నడుస్తాయి బీదింటి, దివిటీలా చల్లగా కొడిగట్టినట్టు జరిగిపోయాయి.

అక్కయ్యకి ఏలోటులేదు. అంతో ఇంతో వున్నవాళ్ళే. అసలు అక్కపెళ్ళి చేసేగా నాన్నమంచమెక్కుతా? అమ్మ వుండగా తొంగిచూళ్ళేదు అక్కయ్య. ఇప్పుడెందుకో ఇంత దుఃఖపడుతోంది. తన పెళ్ళికి రాలేదు సరికదా తనకి ఏవిషయం చెప్పనక్కర్లేదు అని వుత్తరం వ్రాసింది. పాపం అమ్మ ఎంత మంచిదో ఇప్పుడు అర్థమవుతోంది. మనకి తిండికిలేకుండాచేసినా ఆ చారెడుభూమి దానికైనా ఇచ్చాడు మీ నాన్న అని వోసారి, ఆయనుంటే ఈదరిద్రం ఎందుకుండునులే అని మరో సారి అనుకుంటూ వత్తులపెట్టెతో మాట్లాడుకోవటం గుర్తుకి వచ్చాయి మల్లి కాంబకి.

తమ్ముడుని చూస్తేనే కడుపు తరుక్కుపోతోంది.

అక్కయ్య తీసుకెడితే బాగుండును. తనకి ఆ ఇంట్లో స్వతంత్రము వుంటే ఎంతబాగుండేది. తమ్ముడిని తనదగ్గరే పెట్టుకునేది. మళ్ళీ డబ్బుపోయినరోజు గుర్తుకొచ్చి ఆలోచనల్ని అపి అక్కదగ్గరకి వెళ్ళాలని బయలుదేరింది.

తులసికోటదగ్గర కూర్చుని రామాయమ్మతో రహస్యంగామాట్లాడే అక్కని పలకరించటం ఇష్టంలేక సందుమొగలోనే నిల్చిపోయింది మల్లి కాంబ.

రామాయమ్మ విస్తుపోయి వింటోంది. నేను చెప్పినట్టు నాయుడికి చెప్పిరా. ఇదికాస్తా అమ్ముకుంటే ఈ వూరికి రావల్సిన పనేమిటిలే. ఐనా ఇక్కడుండి ఈ కొంప అన్న మెడుతుందా ఏమి నాకు తెలవకడుగుతా అంటూ మెళ్ళో నగలు చిక్కులు విప్పుకుంటోంది అప్పగారు.

మల్లి కాంబ మెల్లిగా దగ్గుతూ అక్కడికి చేరింది. మాటలు మొదలుపెట్టడం తెలవక ఇంటికేసి చూస్తోంది.

'ఇంటితనఖా పోను మిగిలినది లెక్కచూసి ఇచ్చెయ్యమని నాయుడికి కబురెట్టానే' అంటూ గుక్కతిప్పకుండా చెల్లెలికి చెప్పేసింది.

'ఇది కాస్తా అమ్ముకుంటే నాగుఎక్కడుంటాడే' అంటూ మల్లి కాంబ కళ్ళువతుకుంది.

"ఇల్లు వుండిమాత్రం అన్నం పెడుతుందా ఏం? పైగా మీ బావకి ఇంకా ఇవ్వాల్సినది వుందాయె" అని అక్క విషయం బైటపెట్టడం విన్న మల్లికాంబ చెవ్వుల్లో హోరు వచ్చినట్లుఐంది.

'బావకిబాకీవున్నట్లు అమ్మెప్పుడూ చెప్పినట్టుగుర్తులేదు' అని మల్లి కాంబ గొణిగింది.

'బాకీలంటే పుచ్చుకుంటేనా ఏమిటి? ఇల్లు అమ్మపేరవుంది తెలుసా. నాన్న మొదటినించి ముగ్గురికి చెందుతుంది అనేవాడు. అది పట్టుకున్నారు మీ బావ. పైగా మా చిన్నాడు బోలెడుడబ్బు తండ్రికి తెలీకుండాతగలెట్టాడాయె. అదిసర్దకపోతే నాగొంతు పిసుకుతాడు మీ బావ' అంటూ తనసొద చెప్పుకుంటోంది అక్క.

'అమ్మపేర వుంటేమాత్రం మనకి ఏమిలోటుకనక, ఈ డబ్బుకి కక్కుర్తిపడటం నాకేం నచ్చులేదు చెప్పొద్దూ, పాపం వాడికి ఎవరిస్తారు' అని మల్లి కాంబ బైటపెట్టింది తనజాలి.

'నీకంటే ముసిలిభర్త కనక' అనబోయి, నాలిక్కొరుక్కుని, 'మీ ఆయన కావల్సినవి ఇస్తూవుండవచ్చు. నాకు ఎంతవున్నా మీబావ దమ్మిడీ కంటపడనివ్వడు, నాకు పిల్లలు వున్నారు. వచ్చేది ఎందుకు వదులుకోవాలి' అని గట్టిగా అడిగింది అక్క మల్లి కాంబని.

తెల్లవారి రామయ్యగార్ని పిలిపించి అక్కయ్య అనుకున్నంతా చేసి తనకురావల్సింది అంటూ మూర్ఖంగా ఐదు వందలూ తీసుకు, నాగూకి నీతులు, బుద్ధులూ ఖర్చులేనివి కనక చెప్పి అమ్మపట్టు పంచి రాగిచెంబు గుర్తుగా వుంటాయి అంటూ బుట్టలోపెట్టుకు లోకంకోసం గట్టిగా ఏడుస్తూ బండి ఎక్కింది.

మల్లి కాంబకి దుఃఖం పైకిరాలేదు. మనస్సులో పీకుతోంది ఏదోబాధ. ఆ రామయ్యగార్ని మళ్ళా పిలిపించి తనవంతు తమ్ముడికే ముట్టేట్టు 'వాడికి చదువచ్చేలా చేసేబాధ్యత మీదేనని' దుఃఖపడింది.భూపాలరావు పంపిన బండిఎడ్లు వాకిట్లో గంటలు చప్పుడు చేస్తున్నాయి. తమ్ముడ్ని వదల్లేక శూన్యంలో సందెచీకటికి అప్పగింతలుపెట్టి మల్లి కాంబ బండిఎక్కింది. ఈసారి ఆ వూరిని వదిలివెళ్ళబుద్ధి పుట్టలేదు. మళ్ళా మనస్సు సమాధాన పడింది. మరీ చిన్న వాడుకాదు నాగు, పోనీ అక్క చేసింది మంచిదే అనుకుంది. ఆ డబ్బుతో నాగు కాలేజీలో చేరాడు. అమ్మ చదివించలేక ఏడాదిక్రితం ప్యాస్ఐన తమ్ముణ్ణి ఇంట్లో పెట్టుకుంది. రామయ్యగారు చదివిస్తాడులే అని సమాధాన పడింది.

చీకటిని పల్చబరుస్తూ తూర్పుదెస వెలుతురు వళ్లు విరుచుకున్నట్లు మనుషులకి

మసగకిమధ్య వజ్ఞానుల్లా ఆకారాలు కదులుతున్నాయి. మల్లి కాంబ మనసు ఎందుకో తేలికగా వున్నట్టువుంది. తల్లి దిగుళ్ళు ప్రకృతిలో ఆవిరిలా గోషపెడుతూ కలిసిపోయియి. తమ్ముడు ఏకాకిగా నిలిచిపోయాడు పాపం. జీవుడికి బాధలేకుండావుంటే బాగుండును. అంత జ్ఞానము రావాలంటే ఎంతో సాధనవుండాలే అనే అమ్మ మాటలు వినపడ్డట్లె ఉలిక్కిపడింది.

బండి వాకిట్లో నిలబడింది. ఎద్లు గంటలు మారుమ్రోగేలా మెడకదిపి బండిని విడిపోవాలని పక్కలకి చూస్తున్నాయి. మల్లి కాంబ పెరటితలుపు తీసుకు లోపలికి వెళ్ళింది. జామిచెట్టుమీద చిలకలగుంపు కొట్లాడుతూ ఎగిరి, ఎగిరి మళ్ళీ వచ్చి వాలుతున్నాయి.

పక్కింటి మొండిగోడ మీదనించి పాపమ్మ కళ్ళువత్తుకుంటూ అమ్మ వెళ్ళిపోయిందిటగా అంటూ మల్లి కాంబని పలకరించింది.

దుఃఖముతో కంఠము నిండుకొని మాటలురాక గోడదగ్గరకి జరిగి చేష్టలతో బాధని పాపమ్మకి, చెప్పుకుంది. ఇంట్లో వాళ్లు అటూ ఇటూ తిరుగుతున్నా మల్లి కాంబని గుర్తించి పలకరించలేదు. ఎవరిగొడవ వాళ్ళదే. భూపాలరావు వచ్చేసరికి పొద్దుతిరిగింది. కచేరిసావిట్లో కంఠము మ్రోగింది. మల్లి కాంబ ఎదురెళ్ళలేదు. పక్కగదిలో మాటలు వినపడుతున్నాయి. "మీ పిన్నివచ్చిందా?" "వచ్చిందిట. ఆవిడకి ఇంటివిషయాలు పట్టవుగా? ఆ సందుగోడదగ్గరవుంటే ఆవిడకి పొద్దుపోతుంది." అనే చిన్నకూతుర్ని 'సరిలే' అన్న భూపాలరావు కంఠంలోని కఠినత్వం మరి మాట్లాడనివ్వలేదు.

ఆరోజు సందెచీకటి మసగ్గా గడపలో నిల్చిపోయింది. ఇంటినిండా దీపాలువెలిగించారు. చిన్నకూతురుకి మనువు కుదుర్చుకుందుకు పెద్దలువచ్చారు. పెళ్ళివద్దు అంటూ సోకాలెట్టేచెల్లెల్ని అక్క మందలించింది. మల్లి కాంబ జీవితంలో ఏడాది తిరిగినా ఆరోజు భూపాలరావు మనస్సులో జాలి తలుపులు తెరుచుకుంది. ఇంటిగొడవలు చెప్పుకు అలసిపోయాడు. మల్లి కాంబకి ఇంటిభారం మొయ్యమని తాళాలగుత్తి చేతి కిచ్చాడు.

కూతుళ్ళు తండ్రిమీద అలిగి మేనమామ ఇంటికి వెళ్ళినా, మళ్ళా తిరిగిరాక తప్పలేదు.

చెల్లెలు పెళ్ళివంకపెట్టుకు పెద్దకూతురి కోరికలు అంతులేకుండా పెరుగుతున్నాయి. అనుకూలంగా వుండేందుకు దూరపుబంధువు భద్రమ్మని స్వయంగావెళ్ళి వెంటపెట్టుకు వచ్చింది. మడివంకపెట్టుకు వంటగది చుట్టుపక్కలకి ఎవర్నీ రానివ్వకుండా కట్టుదిట్టంచేసింది. భద్రమ్మ.

పెళ్ళి దగ్గరపడుతున్న కొద్దీ భద్రమ్మ పెత్తనం పెరిగిపోతుంది. చీటికిమాటికి మల్లి కాంబని దెప్పటం, పిల్లలదగ్గర గుసగుసలు, వచ్చేపొయ్యేవాళ్ళకి చాటుగా ఆవిడపెత్తనం ఇల్లావుంది, అంటూ మెటికలు విరవటం, అప్పుడప్పుడు మల్లి కాంబ చెవినిపడుతున్నా విననట్లు వూరుకుంటోంది.

తాళాలగుత్తిని మరువకుండా తడిమిచూసుకుని మిగిలినపనులు చూసుకుంటూ తిరగటం పెద్దకూతురికి గిట్టటం లేదు. ఆ తాళాలు ఇయ్యి గంధపుగిన్నె కావాలనో, పన్నీరు బుడ్డికావాలనో మల్లి కాంబని అడిగినా అవి బైటేవున్నాయిలే అంటూ మాట వినిపించుకోకుండా మరోచోటికి మల్లి కాంబ వెళ్ళటం చూసిన భద్రమ్మలో కొత్తఆలోచన పుట్టింది.

'మీ అమ్మసొమ్ము మీ నాన్నసొత్తు మధ్య దాని పెత్తనం ఏమిటంట? నాకు అర్థంకావటంలేదు. నేను చెప్పినట్టు చెయ్యి' అని ఆసరా ఇచ్చింది భద్రమ్మ.

పెళ్ళివారు తెల్లవారుఝామున వెళ్ళిపోతారు. అంతా అటూ ఇటూ తిరుగుతున్నారు. హడావిడిగావుంది మండువా ఇల్లు.

భూపాలరావు ఇనప్పెట్టెతాళాలు తెమ్మని మల్లికాంబని కేకపెట్టాడు.

మొల్లోంచి గుత్తితీసి ముందుకు విసిరింది. భూపాలరావుగార్ని పిలవండమ్మా అన్న పౌరోహితుడి కేకతో మల్లికాంబ పెద్దగదిలో కాలుపెట్టింది.

పెద్దకూతురు సోకాలెడుతోంది. భద్రమ్మ ప్రమాణికాలు చేస్తోంది. పెద్దల్లుడు దెప్పుతున్నాడు, భూపాలరావు బుట్టలుదిమ్మరించి లెక్కలు కట్టుకుంటూ మధ్యమధ్య కూతుర్ని తిడుతున్నాడు.

మెల్లిగా పౌరోహితుడు పిలుస్తున్నాడు అన్న మల్లి కాంబ కంఠమువిని అందరూ అటు తిరిగారు. భద్రమ్మ కళ్ళతో సైగచేసింది. తండ్రిఎదట మాట్లాడ్డానికి ధైర్యం లేక శోకంపెంచింది.

పెద్దల్లుడు కూతురు నోరు మూయించాడు. కాని భద్రమ్మ నోరు విప్పింది. భూపాలరావుకి ఆవిడమాటలు అర్థం కాక మల్లికాంబకేసి చూశాడు. పందిట్లో పురోహితుడుగారి హడావిడి వినపడి అటు వెళ్ళాడు.

గదికి పెద్దల్లుడి చేతితో తాళం పెట్టించింది, అంటూ మల్లి కాంబపై అభాండాలు వేస్తూ కూతుర్ని దగరకి తీసుకు ఓదార్పు మొదలుపెట్టింది భద్రమ్మ.

వచ్చిన చుట్టాలు చెప్పుకుందుకు కావల్సినంత రహస్యం బయటపడింది. విన్నావుటో అన్నమాట అందరి చెవులకి తలోరకంగా వినిపిస్తూ భద్రమ్మే అసలుసంగతి తేలిపోయింది.

ఐనా నీ కెందుకు! నాకు తెలీకడుగుతా, అని మరో దూరంబంధువు భద్రమ్మని నిలదీసింది.

దానికి కూటికి తక్కువయ్యాగా ఇంతమంది పిల్లలు వున్నా ఎగబడి కట్టుకుంటా. అల్లా అంటే సౌరుషంతో గింజుకోవడం చూస్తే మండుతోంది, అనుకో. ఏదో పెద్ద రాణి వాసంనించి వచ్చినదానిలా పలకరించినా మాటే మాట్లాడదు. ముసలాడిని మురిపిస్తున్నానుగదా అన్న గర్వమేమొ అంటూ మల్లి కాంబమీది అక్కసు బయటపెట్టింది భద్రమ్మ.

అది ఎలాగన్నా వుండనీ, ఆ పిల్లలకి నువ్వు తోడైతే నీకు వరిగేది ఏమిటో నాకు అర్థంకావటంలేదు. అప్రతిష్ట, డబ్బు మూటగట్టుకు ఆ పిల్ల తప్పుకుంటే నామీద పడేది ఆ వాదు, అంటూ ఆశ్చర్యంగా కళ్ళు తెరచి భద్రమ్మకేసి చూసింది వయస్సు మళ్ళిన చుట్టపావిడ.

అసలు జరిగింది ఏమిటో, అంటూ కొంచము చాదస్తంగా మాట్లాడే వదినగారు భద్రమ్మ పక్కన కూలబడింది.

"ఏమి వుందిలే విడ్డూరం. తల్లి వస్తువులు అది తీసుకుందామని ఇనప్పెట్టె తెరిచింది. అంతలో తండ్రిని వెంటేసుకు తాటకిలా సవతితల్లి రానేవచ్చే" అని భద్రమ్మ మాట పూర్తి చేసింది.

"అంతేకాదటగా. డబ్బు, నోట్లు అందులో వున్నవన్నీ మూటగట్టారుటగా! నీ కేమి యిచ్చిందేమిటి," అంటూ నెరసిన జుట్టుని వేళ్ళతో దువ్వుకుంటు అడిగింది మరొహ ఆవిడ.

"ఏవమ్మోవు నీకు వుంటే నువ్వు చుట్టుకో కాని తేలిక మాటలు మాట్లాడమోక. ఎంతలేకపోయినా డబ్బుకి కక్కుర్తి పడే గటంకాదు ఇది. ఏదో మాటసాయం అంటే సరేనన్నా తెల్సిందా. ఆ గుణమేవుంటే మా కాంతాన్కే ఇప్పించే దాన్నిగా," అంటూ తన నిజాయితీ చెప్పుకుంది భద్రమ్మ.

"ఆ దానికేంలే. కాంతమ్మనీమాట వినకుండా లేచిపోయిందిటగా;" అని వొదిన వారు బైట పెట్టడంతో భద్రమ్మకి కోపం దుఃఖం కలిసి వక్కసారి పెద్దపెట్టున బయటపడ్డా చుట్టూ చేరినవాళ్ళు మా కెందుకులే అంటూ మెల్లగా అటూ ఇటూ జరిగిపోయారు.

బంధువులు వకరొకరే వెడుతున్నా భద్రమ్మకి వెళ్ళబుద్ధి పుట్టలేదు. ఎవరు ఏమి

అనుకున్నా నేనుమాత్రం చిన్నపిల్ల తిరిగిరానిదే వెళ్ళేది వట్టిమాట - అంటూ అప్పుడప్పుడూ తనే అనుకుంటోంది. ఖాళీపందిట్లో పట్టెమంచంమ్మీద నడుంవాల్చిన భూపాలరావు దూరంగా కనబడుతున్నాడు. మల్లి కాంబ పమిటకొంగువెనక నవ్వుని దాచుకున్నట్టు కనపడుతోంది. అన్నీ సవ్యంగావుంటే తన కాంతమ్మ తిరగాల్సినిల్లు, ఆ యోగం తప్పిపోయినందుకు ఘోషపెట్టింది. యోగం దీని మొహానరాసివుంటే దానికెల్లా దక్కుతుంది, అని మనస్సు లోనే మల్లి కాంబని శాపనార్థాలు పెట్టింది భద్రమ్మ.

చిన్నకూతురు తిరిగివస్తూ, కాంతమ్మని వెంట పెట్టుకు వచ్చింది. కాంతమ్మని చూడగానే భద్రమ్మదుఃఖము మర్చిపోయి, తిట్లు, శాపనార్థాలు పూర్తిచేసి, ఎండిపోయిన గొంతుకతో కష్టసుఖాలు అడగడం మొదలుపెట్టింది. కాంతమ్మ తనకేం కష్టాలులేనట్టు తనేం చెయ్యకూడని పని చెయ్యలే దన్న వాదానికిదిగి, భద్రమ్మపై విసుక్కోవటం మల్లి కాంబ గుమ్మంలోనిల్చుని వింటోంది.

ఏంసోద్దెం చూస్తావులే. వెళ్లి పనిచూసుకోమని మల్లి కాంబని దెప్పింది భద్రమ్మ.

ఆవిడజోలి నీకెందుకే అని శాంతమ్మ భద్రమ్మని మందలిస్తూ 'మీరువచ్చి కూర్చోండి ఆవిడమాటలకేం' అంటూ మల్లికాంబని చెయ్యిపుచ్చుకు తీసుకొచ్చింది.

కాంతమ్మ వచ్చిన దగ్గరనుండీ ఇల్లు అంతా తిరుగుతూ అది ఏమిటి ఇదేమిటి అంటూ అన్నీ తిరగేస్తూ అందర్నీ పలకరించి నవ్విస్తూండటం పెద్దకూతురికి గిట్టకపోయినా భద్రమ్మ ఏమైనా అనుకుంటుందని వూరుకుంది.

భూపాలరావుకి కాంతమ్మ విచ్చలవిడిగా ఇంట్లో తిరగడం గిట్టలేదు. ఎందుకు వచ్చినట్టు అని భద్రమ్మని అడిగాడు.

ఎవరు నాయనా అంటూ ఎరగనట్టడిగింది భద్రమ్మ.

'అదే నీ మనమరాలు,' అంటూండగానే కాంతమ్మ వచ్చేసింది అక్కడికి.

'నువ్వెందుకొచ్చావని అడుగుతున్నాడే మామయ్య' అని చెప్పింది భద్రమ్మ.

'ఎందుకేమిటి! చూసి వెడదామని, అన్నట్టు మీ పెద్దాడు మొన్నే వస్తానన్నాడు. రాలేదేమోనని - నాలిక్కరుచుకుని - స్టేషన్‌లో కనపడితే అడిగాలే! అప్పుడు చెప్పాడు వస్తున్నట్టు అంది కాంతమ్మ.

భూపాలరావుకి తల తిరిగినట్టయింది. 'వాడిదీ నీలాంటి బతుకే కనక చెప్పివుంటాడులే' అంటూ విసురుగా పెరట్లోకి వెళ్ళిపోయాడు.

'కొడుక్కి ఈడైన పిల్లని తను కట్టుకొన్నది చాలక, తప్పులు పడుతున్నాడే, భలేవాడే' అంటూ ఇల్లు ఎగిరిపోయేలా అర్థంలేకుండా నవ్వుతోంది కాంతమ్మ.

'వూరుకోవే, వెకిలినవ్వు' అని భద్రమ్మ పళ్ళుకొరికింది.

'అసలు నీఈడుదాన్ని చేసివుండాల్సింది, మామయ్యకి' అంటూ గుక్కపట్టినట్టు ఇంకా నవ్వుతోంది కాంతమ్మ.

ఛీ, పాడుపిల్లా అంటూ భద్రమ్మ వంటగదిలోకి వెళ్ళి పోయింది.

భూపాలరావు పెద్దకొడుకు రావడంతో సందడి విధివేంపు వినపడి కాంతమ్మ వెళ్ళింది.

'ఆ వెళ్ళటం, మళ్ళీ ఇప్పుడురా రావటం' అంటూ చెల్లెళ్ళు అడుగుతున్నారు.

'నాకోసం బెంగెట్టుకొనేవాళ్ళు ఎవరున్నారులే అంటూ కాంతమ్మకేసి చూసి ముందుగదిలోకి వెళ్ళబోయాడు. తండ్రి అటు ఎదురురావటం చూసి తలవంచుకు నిల్చున్నాడు.

'ఏదో వచ్చాడులే, ఏమి అనకు బాబూ' అంటూ చిన్న కూతురు ప్రాధేయపడినట్లు తండ్రితో అంటూంది.

భద్రమ్మ కొంగు కప్పుకుంటూ హడావిడిగా వచ్చి 'రా బాబూ రా! నీ యింటికి నువ్వు వచ్చావులే నాయనా' అంటూ అందర్ని తప్పించుకు ముందుకు వెళ్ళింది.

'నీ హడావిడి ఎక్కువగా వుందే' అంటూ కాంతమ్మ భద్రమ్మని దెప్పుతూ నవ్వుతోంది.

భూపాలరావు కోపంగా కాంతమ్మకేసి చూసి లోపలికి వెళ్ళిపోయాడు.

కాంతమ్మ నవ్వుతో కలిపి అంతా నవ్వటం భూపాలరావుకి ఎవరో వెన్నుమీద కొట్టినట్లు బాధ కలిగింది.

మల్లి కాంబకి అర్థంకాక నిల్చుని చూస్తోంది.

తమ్ముడు నాగు వ్రాసిన వుత్తరం చూపెట్టాలి, కాని సమయంకోసం చూస్తోంది. డబ్బు సంగతి చెబితే ఏమంటారో - మళ్ళీ భయపడి వూరుకుంది.

'వాడొచ్చాడు, తాళాలుజాగ్రత్తతెల్సిందా' అంటూ మల్లికాంబకేసి చూశాడు భూపాలరావు.

మనస్సులో కోరిక మెరుపులా మెరిసింది. చేతిలో తాళాలు కదిలాయి. భయంతో అరికాళ్ళు చెమ్మగిల్లాయి. "ఏమోబాబు మీ దగ్గరే వుంచటం మంచిది" అంటూ వణికే చేతితో తాళాలు ఇవ్వబోయింది మల్లికాంబ.

"ఏదో అప్పుడు అనుమానం అల్లా చేయించింది..." అంటూ గతాన్ని తల్చుకు బాధపడుతూ మల్లి కాంబని పక్కన కూర్చోపెట్టుకున్నాడు.

తనమనస్సు స్వాధీనం తప్పి తననేంచేస్తుందో తెలియక తాళాలు తనకి వద్దంటూ మళ్ళీ ఇచ్చేసింది మల్లికాంబ.

మొల్లోంచి డబ్బుతీసి పెట్టెలో పెట్టమన్నాడు భూపాలరావు.

డబ్బు తీస్తోంది. లెక్కలు చెపుతోంది, మళ్ళా పెడుతోంది. ఎన్నోరకాలు మనస్సుని తప్పించే ఆలోచనలు వస్తున్నాయి. ధైర్యంచాలక ప్రతీసారి పెట్టె మూసివస్తోంది. నాగు దగ్గరనుండి వుత్తరం వచ్చి అప్పుడే నాలుగురోజులు అయింది. ఇంకెంతో వ్యవధిలేదు. వాడి డబ్బు రామయ్యగారు ఇస్తే తనకి బాధ లేకపోను. ఐనా వాడిదే వాడుకోవాలా? రామయ్యగారి ధర్మగుణంమీద నమ్మకం పోయింది. డబ్బునిచూస్తే అందరికి సొంతము చేసుకోవాలని వుంటుందేమో. మరొహప్పుడైతే భూపాలరావుకి చెప్పేందుకు వీలువుండేది.

ఇప్పుడే పెద్దకొడుకుకూడా వున్నాడాయె. ఏక్షణంలో ఎంత కావాలని గోల చేస్తాడోనన్న భయం - తండ్రికేమిటి, అందరికీ భయమే.

పక్కింటి పాపమ్మ పిల్చి చెప్పింది, తను వూరికి వెడుతున్నట్టు, తమ్ముడికి డబ్బు పంపాలంటే అదివక్కటే మార్గం. ఎల్లా తనదగ్గరేది! ఆలోచనలతో బుర్రవేడెక్కి నిద్రపట్టలేదు.

భూపాలరావు తెల్లవారితే డబ్బు ఇంటిలో వుంచడు, ఎవరికో ఇస్తానని మాట ఇచ్చాడు. చీకట్లో పెద్దల్లుడు నిల్చుని పిలుస్తున్నాడు. 'చూడు మల్లి! పెట్టె తెరచి ముందు ఇచ్చిన సంచీ తీసుకురా' అని భూపాలరావు చెప్పటంతో తాళాలు తీసుకుని వెళ్ళింది. ఆలోచించటం మాని పక్కసొరుగు కట్ట లోంచి లాగిన కాయితాలు జాకెట్టులోకి తీసి తాళంపెట్టుకు వచ్చింది.

భూపాలరావు అల్లుణ్ణి పంపేందుకు సందుగుమ్మంలోకి వెళ్ళాడు.

గోడపక్క బండపైకి ఎక్కి పాపమ్మ ఇంట్లోకిచూసింది. గుడ్డిదీపం వెలుగులో పాపమ్మ ఇల్లు సర్దుకుంటోంది. మాట పైకిరాక తాటాకుతో చప్పుడు చేసింది. 'ఎవరారు' అంటూ పాపమ్మ దీపప్పుబుడ్డీ ఎత్తిచూసి సందులోకి వచ్చింది.

వంట్లోంచి వేడి వస్తోంది. పైకి నీళ్ళు వోడుతున్నాయి. కాళ్లు చేతులు, గుండె వేగంగా కొట్టుకు నిల్చిపోతుందన్న భయంతో చేత్తో అదుముకుంటోంది ఇది నాగూకి అన్న వాక్యం పూర్తి చెయ్యలేక రొప్పుతోంది మల్లి కాంబ.

"వంట్లో బాగోలేదా? రొప్పుతున్నారు." అని పాపమ్మ పరామర్శ మొదలుపెట్టింది. భూపాలరావు వెనక్కి రావటంచూసి మల్లికాంబ చేత్తో వెడతాననో ఎవరికీ చెప్పద్దనో సైగచేసి రాయిమించి దిగింది. గుడ్డిదీపం వెల్తుర్లో అర్ధంకాక పాపమ్మ కాస్సేపుచూసి లోపలికి వెళ్లిపోయింది.

మల్లికాంబకి కునుకుపట్టలేదు. మళ్ళీపిల్చి పాపమ్మ నడిగి తీసేసుకుందాము అనుకుంది కాని భూపాలరావు లేస్తే అన్న బయంతో ఎటూ తేల్చుకోలేకుండానే కాలం వెల్తురు లోకి జరిగిపోతోంది. పాపమ్మ బండి ఎక్కినసందడి ఎడ్లు కదిలినచప్పుడు అన్నీ తన గుండెలపైనే ప్రయాణం చేస్తున్నట్లు వుంది. వచ్చీరాని వెల్తుర్ని చూడటం అంటే తనకెంతోఇష్టం వుండేది. కాని అప్పుడు ఎందుకో బాధగావుంది. తను ఎందుకు చేసినట్లు, వూరుకుంటేపోయేదిగా! అర్ధంలేనిబాధలు మనస్సుని పీకుతున్నాయి.

భూపాలరావు లేచేవేళైంది. పెద్దపాలేరు, రొప్పుతూ అయ్యగారో అంటూ అరుస్తున్నాడు. ఇంట్లో సందడిలేదు.

"పెరటితలుపులన్నీ తెరచి వున్నాయండి. గొడ్ల కాడ ఈ సంచి పడివుండాది." అంటూ అల్లిన దారపుసంచి ముందుకి విసిరాడు పాలేరు.

నిద్రకళ్ళని తుడుచుకుంటూ భూపాలరావు మాట లేకుండా పంచలోచతికిలపడి సంచి చేతిలోకితీసుకున్నాడు.

భద్రమ్మ కొంతసేపు మొద్దులానిల్చుని, వున్నట్టుగా గుండెలు బాదుకుంటూ సోకాలు మొదలెట్టింది. ఎవరు చేశారో నాయనా! పాపం పుణ్యం నాకైతేతెలీదు. అని మొదలుపెట్టింది.

పెద్దల్లుడువచ్చి మామగార్ని లోపలికి పిల్చుకెళ్ళాడు. మల్లికాంబ జామిచెట్టునిపట్టుకు అచేతనంగా నిల్చుంది. ఆ సంచిలోదే తనుతీసినడబ్బు. మిగిలినది ఏమైనట్టు అర్ధంకావటంలేదు.

పెద్దల్లుడు మల్లి కాంబని పిల్చాడు. గుండె పట్టుకున్నట్టువుంది, మెల్లిగా లోపలకిచేరింది.

భూపాలరావు మొహం అటుతిప్పుక్కూర్చున్నాడు. దానికేం తెల్సు దానిమొహం. అప్పుడే పెట్టి మూసేసిందిగా, అన్నమాటతో ప్రాణం కొంచము కుదుటపడింది మల్లి కాంబకి.

"ఆ కాంతమ్మ, పెద్దాడుకలిసి చేసినపనట ఇది" అంటూ మల్లి కాంబతో చెప్పుకున్నాడు భూపాలరావు.

పెద్దల్లుడిచూపులు తన మనస్సులోని భయాన్ని చదువుతున్నట్లు వున్నాయి.

మాటలు వణుకుతున్నాయి. ఎంతపోయివుంటుంది; అడగాలనివుంది మల్లి కాంబకి. 'రెండు సంచులుపోయాయి. కొంత వాడివుండవచ్చు' అన్న పెద్దల్లుడి చివరిమాటలు, మనస్సులో గుచ్చుకున్నాయి. మొదట చెయ్యనినేరానికి శిక్షే నయమనిపించింది. ఇప్పుడు తన మనస్సే కోతపెడుతోంది.

కాలం జరిగినా మనస్సు సమాధానపడటంలేదు. పెద్దల్లుడిచూపులు తన్ని తీక్షణంగా ఎప్పుడూ తాకుతున్నట్లే వుంటోంది. తెల్లవారుఝాముతో మలినమైన మనస్సుని, మననం చేసుకోవటంతో తెల్లవారుతుంది.

✧